

పెళ్లి పనులకు వాడిన స్కూల్ బస్సుల సీజ్

భీమవరం టౌన్ : పాఠశాల బస్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర కార్యక్రమాలకు వినియోగించరాదని, అలా వినియోగించినట్లయితే భారీగా అపరాధరుసుము విధించి, లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం అర్ధరాత్రి స్కూల్ బస్సులలో పెళ్లి బృందాలను తరలిస్తుండగా రవాణా శాఖ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా మూడు స్కూల్ బస్సులను సీజు చేసి ఆ బస్సులను భీమవరం రవాణా శాఖ సీజరు యార్డ్‌లో ఉంచామని, అదేవిధంగా వాటిపై రూ.1,85,540 అపరాధ రుసుము, పన్నును విధించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ స్కూల్ బస్సులను పైవిధంగా పెళ్లి బృందాలకు, ఏ విధమైన ఇతర కార్యక్రమాలకు వినియోగించుట నిబంధనలకు విరుద్ధం, పర్మిట్ సస్పెన్షన్, రూ.10 వేల అపరాధ రుసుంకు, ఒక్కో సీటుకు రూ.1120 పన్ను విధించబడునని తెలియజేశారు. ఈ తనిఖీలు, దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలియజేశారు.

కౌలు రైతుకు ఉరి.. 'భూధార్'..!

భూయజమానులకే విశిష్ట గుర్తింపు సంఖ్య
ఆధార్ కార్డు తరహాలో 11 అంకెల విశిష్ట సంఖ్యతో భూధార్
జిల్లాలో జోరుగా సాగుతున్న 'భూధార్' ప్రక్రియ
రైతులకు అందించే ప్రభుత్వ పథకాలకు ఇక ఇదే ఆధారం
కౌలురైతులను పూర్తిగా పక్కన పట్టేసిన పరిస్థితి
రెండు జిల్లాల్లో 3 లక్షల మంది కౌలు రైతుల పరిస్థితేమిటో
కూటమి సర్కార్ తీరుపై సర్వత్రా ఆగ్రహం


ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ సర్కార్ కౌలురైతులకు చేస్తున్న అన్యాయానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సై అంటూ ముందుకు సాగుతోంది. ప్రభుత్వం అందించే ప్రతి సాయమూ భూయజమానులకే దక్కేలా తెచ్చిన 'భూధార్' కౌలురైతులకు ఉరితాడుగా మారనుంది. ఈ విధానం అత్యధికంగా కౌలురైతులు ఉన్న ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాస్తవ సాగుదారులైన కౌలురైతుల బతుకులను పూర్తిగా దెబ్బతీసేలా భూధార్‌ను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. పౌరుల గుర్తింపునకు ఆధార్ కార్డు తరహాలో రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం భూధార్ కార్డుల జారీ ప్రక్రియను తెరపైకి తెచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వంతపాడుతూ భూయజమానులందరికీ భూధార్ కార్డులు అందించే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టింది. ఈ నెల 27వ తేదీలోపు 30 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది. దీంతో రబీ సాగులో రైతుల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేసి వ్యవసాయ అధికారులంతా భూధార్ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. 11 అంకెలు గల విశిష్ట సంఖ్యతో భూధార్ కార్డులను భూములున్న యజమానులకు అందజేసే ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే ఏలూరు జిల్లాలో 1,686 మంది భూములున్న రైతుల రిజిస్ట్రేషన్ సైతం జరిగింది. పశ్చిమలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇక నుంచి భూధార్ ఆధారంగా రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలు, వ్యవసాయ సంబంధిత సేవలు, యంత్రాల అందజేత, పంటల బీమా, పిఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందనున్నాయి.



కౌలు రైతుల పరిస్థితి ఏమిటి?

వ్యవసాయ సాగులో భూయజమానుల పాత్ర చాలా తక్కువగా ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలురైతులే చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తూ అందరికీ అన్నం పెడుతున్న పరిస్థితి ఉంది. వాస్తవ సాగుదారులకు ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎప్పటి నుంచో కౌలురైతులు పోరాటం చేస్తున్నారు. అందులో భాగంగానే 2011లో కౌలురైతుల చట్టం వచ్చింది. 2019లో ఆ చట్టాన్ని సవరిస్తూ భూయజమానుల అంగీకారంతోనే కౌలుకార్డులు ఇవ్వాలని వైసిపి ప్రభుత్వం చేసిన చట్టం కౌలురైతుల బతుకులపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో 2024 మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కౌలు రైతులు వైసిపిని చిత్తుగా ఓడించారు. రెండు జిల్లాల్లో మొత్తం 14 అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లలో కూటమి అభ్యర్థులనే గెలిపించారు. తాము అధికారంలోకి వస్తే నూతన కౌలుచట్టం తెచ్చి కౌలురైతులను ఆదుకుంటామని కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చాక దానికి భిన్నంగా కేంద్రంతో కుమ్మక్కై భూయజమానులకు భూధార్ ప్రక్రియను వేగంగా సాగిస్తోంది. భూదార్ కార్డుల జారీతో ఇక కౌలు రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే ఏ ఒక్క సాయమూ అందకుండాపోనుంది. కౌలుచట్టాలు సైతం పూర్తిగా నిర్వీర్యం కానున్నాయి. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు తీరని అన్యాయం చేస్తున్న పరిస్థితి ఉంది. వ్యవసాయ సాగు చేయని భూయజమానుల జేబుల్లోకి ప్రభుత్వ సాయం వెళ్లనుంది. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కౌలురైతుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వినతి అందిస్తున్న జర్నలిస్టులు, సంఘాల నేతలు,

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

ముక్కువ ప్రజాశక్తి విలేకరిపై దాడికి వ్యతిరేకంగా నిరసనలు

... వార్త 6లో



నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజుకు వినతి అందిస్తున్న జర్నలిస్టులు, సంఘాల నేతలు,

మొబైల్ ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని అంగన్వాడీ పిల్లల నమోదుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఆరేళ్ల పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదు చేసేందుకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల 18 నుండి 21వ తేదీ వరకు, 24 నుండి 28వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రంలో ఆరేళ్ల పిల్లలకు క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని మొత్తం 99 ఆధార్ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి జిల్లాలోని ఆధార్ కార్డు లేని పిల్లలున్న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అంగన్వాడీ వర్కర్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి అవసరమైన ధ్రువపత్రాలతో ప్రత్యేక ఆధార్ క్యాంపులో కొత్త ఆధార్ కార్డులకు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు ఆధార్ కార్డులు లేని పిల్లలందరికీ నూరుశాతం కొత్త ఆధార్ కార్డుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ మండలాల్లో ఆచంట-2, ఆకివీడు-4, అత్తిలి-3, భీమవరం-6, యలమంచిలి-5, గణపవరం-5, పెంటపాడు-3, ఇరగవరం-2, కాళ్ల-4, మొగల్తూరు-4, నరసాపురం-4, పాలకొల్లు-4, పాలకోడేరు-3, పెనుగొండ-3, పెనుమంట్ర-3, పోడూరు-4, తాడేపల్లిగూడెం-6, తణుకు-2, ఉండి-4, వీరవాసరం-4 ఆధార్ కేంద్రాలను, అర్బన్ మండలాల్లో భీమవరం-5, నరసాపురం-4, పాలకొల్లు-4, తాడేపల్లిగూడెం-5, తణుకు-6 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు.

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యాన ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం మండలం అమృతపురం, ఇటుకలగుంట గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరంపోరాడే వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాలుపూరి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



పెనుమంట్ర మండలం మార్టేరులో..

భీమవరం టౌన్: పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ దిరుసుమర్రు, నాగిడిపాలెం గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. సిఐటియు నేత ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మండలిలో ప్రజా సమస్యలపై గొంతెత్తడంతోపాటు ప్రజా ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని అండగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో బి.నాగబాబు, గడ్డం అబ్రహాం, సిహెచ్.కుమార్‌బాబ్జి, పట్టెం సంజీవి, నాగిడి రామచంద్రరావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలంలో..


పెనుమంట్ర: పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఎపి కౌలురైతు సంఘం నేత కేతా గోపాలన్ కోరారు. మార్టేరులో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి రాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు సూర్యప్రకాష్, పిల్లి జగదీస్, జుత్తిగ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే

అధికారులకు జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో రికార్డుల ప్రకారం సాగుతున్న రీసర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను సోమవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. రైతుల సమక్షంలో పనులు జరగాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆయన రైతులతో మాట్లాడి రీసర్వేపై అవగాహన కల్పించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. అధికారులు ముందుగా మీకు నోటీసులు ఇస్తున్నారా, లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పనులు ఎలా జరుగుతున్నాయి అని అడిగి తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వేకు సంబంధించి ఇప్పటివరకు రైతులకు స్వయంగా ఎన్ని నోటీసులు ఇచ్చారు, పోస్ట్ ద్వారా ఎన్ని పంపించారు అని విచారించి, పంపిన నోటీసుల వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నోటీసులు అందజేసినప్పటికీ గ్రామంలో ఆరుగురు రైతులు రావడం లేదని గ్రామ సర్వేయర్ జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జెసి స్పందిస్తూ రీసర్వేకు హాజరుకాని ఆరుగురు రైతులను పిలిచి మాట్లాడి, సర్వే పనులు పూర్తయ్యేలా చూడాలని ఆర్‌డిఒ, తహశీల్దార్‌ను ఆదేశించారు. అధికారులు ముందుగా రైతులకు నోటీసులు అందజేసి వారి సమక్షంలో రీసర్వే పనులను చేయాలని, భూ



వివరాలు తెలుసుకుంటున్న జెసి

యజమానులకు తెలియకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వే పనులు చేయరాదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూమి విషయంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ముందుగా అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని జెసి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మండల సర్వే అధికారి, సర్వే డిటి, విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం సందర్శన

తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయాన్ని జెసి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ ఛాంబర్లో ఆర్‌డిఒ, జిల్లా సర్వే అధికారి, తహశీల్దార్ సమక్షంలో గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామ సభల్లో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

ఎన్నికల్లో కనిపించే పేదలు ఇప్పుడు కనిపించరా

పేదల ఇళ్ల తొలగింపును నిరసిస్తూ సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్


'మా ఇళ్లను తొలగించొద్దు' అంటూ భీమవరంలో కోర్టుపక్కన నిరాశ్రయులైన పేదలు, గణపతినగర్ పేదలు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పెత్తందారుల కోసం పేదలను బలిపెట్టొద్దని, నిరాశ్రయులైన పేదలకు తక్షణమే ఇళ్లు కేటాయించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ పట్టణంలో బడాబాబులు ఆక్రమించిన స్థలాలు, కాలువలు చాలానే ఉన్నాయని, వాటి జోలికి వెళ్లకుండా పేదల ఇళ్లను తొలగించడం దారుణమని అన్నారు. చంటి బిడ్డలు, వృద్ధులు సామాన్లుతో సహా రోడ్డున పడ్డారని, ఎండ, చలి, దోమల్లో చెట్ల కింద తలదాచుకోవాల్సిన దుస్థితిని అధికారులు కల్పించారని, ఇది అత్యంత దారుణమని అన్నారు. గణపతిరాజు నగర్‌లో సుమారు 60 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలపై ఒక పెత్తందారు పెట్టిన పిటీషన్‌కు తలొగ్గి అధికారులు ఇళ్ల తొలగింపునకు మార్కింగ్ వేయడంతో ఒక పేద గుండె అకస్మాత్తుగా ఆగిపోయిందని అన్నారు. ప్రజావసరాల రీత్యా అంటూనే ప్రజలపై దాడులు చేయడం అన్యాయమన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే జోక్యం చేసుకుని నిరాశ్రయులైన వారికి భోజనాలు ఏర్పాటు చేయడంతోపాటు ఖాళీగా ఉన్న టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గణపతిరాజు నగర్ కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమానికి సిపిఎం నాయకులు డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు, చంద్రరావు, అప్పలస్వామి, ఏసమ్మ, పైడియ్య తదితరులు నాయకత్వం వహించారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు



భీమవరం : మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటం తప్పదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ. మాతా, శిశు సంక్షేమంపై పాలకులకు చిత్తశుద్ధి లేదని ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కేటాయింపులు చూస్తే అర్థమవుతుందన్నారు. వేతనాల పెంపు కోసం, రాజకీయ వేధింపులు ఆపాలని, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు మరొకసారి ఆందోళనకు సిద్ధం



పెనుమంట్ర : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

కావడం అత్యవసరమన్నారు. పెరిగిన ధరలు, చాలీచాలని వేతనాలు రకరకాల పేర్లతో ఆన్‌లైన్ సేవలకు పరిమితం చేయడం వంటి సమస్యలు అంగన్వాడీలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వం అయినా సమస్యలు పరిష్కరిస్తుందని ఆశతో ఎదురుచూసిన అంగన్వాడీలకు చేదు అనుభవం ఎదురైందని అన్నారు. ప్రభుత్వ తాత్సారాన్ని పక్కనపెట్టి తక్షణమే అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మరో ఉధృతమైన పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ, అంగన్వాడీ నాయకులు నాగరత్నం, శాంతి కుమారి దుర్గ, లక్ష్మి, సూర్యవతి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

తణుకు : అంగన్వాడీలకు గత సమ్మె కాలంలో ఇచ్చిన అన్ని హామీలకు జిఒలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తణుకు ప్రాజెక్టు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్వాడీ ఉద్యోగులుగా గుర్తించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ అంగన్వాడీలు గత వైసిపి ప్రభుత్వంలో 42 రోజుల పాటు ఆందోళన నిర్వహించిన సంగతి అందరికీ తెలిసిందేనని అన్నారు. ఆ రోజున ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ జిఒ రూపంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని చెప్పిన దానిని అమలు చేయాలని అన్నారు. అంగన్వాడీలు అందిస్తున్నటువంటి అనేక రకాల సేవల పట్ల నేటికీ ప్రభుత్వానికి గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 28న జరుగుతున్నటువంటి రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీల సమస్యలు పరిష్కారం దిశగా ఉండాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, శ్రామిక మహిళా నాయకులు అడ్డగర్ల అజయకుమారి, ఎన్.ఆదినారాయణబాబు, గార రంగారావు, జ్యోతి, నళిని, ప్రమీల, తులసి, కనకదుర్గ, మధుషీల, మంగతాయారు, బేబి, సుభద్ర, వెంకాయమ్మ పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడీలు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీలకు కనీస వేతన రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, ఎడ్ల చిట్టిబాబు, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జి.పెద్దింట్లు, ఎస్.సారమ్మ పాల్గొన్నారు.



మొగల్తూరు : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

పెనుమంట్ర : సమ్మె కాలంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ సోమవారం మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు ధర్నా నిర్వహించి, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ అంగర కృష్ణ కుమారికి వినతి పత్రం అందించారు. ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలతో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, కౌలు రైతు జిల్లా నాయకులు కె.సుబ్బరాజు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కేతా పద్మజ పాల్గొన్నారు.



తణుకులో అంగన్వాడీల ఆందోళన

ఆకివీడు : పోరాటంతోనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆమేరకు ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. అంగన్వాడీల జీతాలు వెంటనే పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ్మెకాలపు హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడారు. సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటి నాయుడు, బి.వర్మ, డోకల రవితేజ, షేక్ వలి, అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

1వ తేదీ నుంచి జిల్లా అంతటా ప్లాస్టిక్ నిషేధం అమలు
ఏప్రిల్ 1వ తేదీ నాటికి రోడ్లపై చెత్త కనిపించకూడదు
కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి రాజమండ్రి ఆర్‌డిఎంఎ, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా అధికారులు, పంచాయతీ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా దోమల నివారణ, పారిశుధ్యం నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై సమీక్షించారు. రాజమండ్రి నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్‌డి సిహెచ్.నాగనరసింహం జిల్లాలో దోమల నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలపై మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న దోమలను నిర్మూలించేందుకు మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. తొలుత డ్రెయినేజీలు, కల్వర్టుల కింద మట్టి తొలగింపు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టి దోమల నివారణ మందును కల్వర్టుల అడుగు భాగంతో సహా అన్ని ప్రాంతాల్లో స్ప్రే చేయించాలన్నారు. ఆయిల్ బాల్స్‌ని కూడా విరివిగా చల్లించాలన్నారు. ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు స్వచ్ఛందంగా చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో సెప్టిక్ ట్యాంక్ పైపులు నేరుగా తాగునీటి కాలువల్లో పెట్టారన్న ఫిర్యాదులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సరైన చర్య కాదని, సంబంధిత గృహ యజమానులు స్వచ్ఛందంగా తొలగించి ప్రజా ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇకనుంచి మున్సిపల్ ప్రాంతాల్లో కూడా వర్మీ కంపోస్ట్‌ను తయారు చేయాలని సూచించారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాలకు పైగా ఆక్వా సాగు చేస్తున్నారని, వర్మీ కంపోస్ట్‌ను వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 200 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునర్ వినియోగంలోనికి తీసుకురావడం జరిగిందని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేకరించడంతోపాటు, వర్మీ కంపోస్ట్‌ను తయారు చేయాలన్నారు. తొలుత భీమవరం పట్టణంలో ఈనెల 1 నుంచి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ప్లాస్టిక్ నిషేధాన్ని, మార్చి ఒకటి నుంచి జిల్లా అంతట అమలుకు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఏప్రిల్ ఒకటి నాటికి రోడ్లపైన చెత్త ఎట్టి పరిస్థితుల్లో కనిపించకూడదనే లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని డిపిఒను ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణ శ్రీ, మెప్మా అధికారి గ్రంధి పార్వతి పాల్గొన్నారు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల పరిశీలన

నరసాపురం: పట్టణంలోని వార్డు పర్యటనలో భాగంగా 2, 31వ వార్డు తదితర ప్రాంతాలలో కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ నివాసాల మధ్యలో ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా, పిచ్చి మొక్కలతో ఉండకూడదు అన్నారు. నరసాపురం పట్టణంలో ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే సదరు స్థలాలలో నరసాపురం పురపాలక సంఘం బోర్డులు ఏర్పాటు చేయాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థులకు టీ షర్టుల బహూకరణ

పాలకొల్లు రూరల్: మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్-2, ప్రముఖ పారిశ్రామిక వేత్త, దాత నడపన జగపతిరావు సౌజన్యంతో ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్ రాయపూడి భవాని ప్రసాద్ సహకారంతో విద్యార్థులకు స్కూలు లోగో గల టీషర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, దాతలు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని మంచి పౌరులుగా, ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఎంపిటిసి ఏలేటి ప్రసాద్ చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బేబీ సరోజ, ఎస్ఎంసి వైస్ చైర్మన్ ఎడ్లపల్లి జ్యోతి, సభ్యులు మాండ్రు అవ్వమ్మ, తోటే సుశీల, బద్ద రాజమణి, ఏలేటి లక్ష్మి, విప్పర్తి కాంతమ్మ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థి, కాకినాడ సివిల్ జడ్జి బీర శ్రీనివాస్ పాఠశాలకు రూ.30 వేల విలువ గల కంప్యూటర్ అందజేశారు. ఈ సందర్భంగా బీర శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత శిఖరాలకు ఎదిగారని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దీనికి సహకరించిన పూర్వవిద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎస్ఎన్.ప్రసాద్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చింతపల్లి గణరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

భీమవరం టౌన్: సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిధని, వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు రూ.12,61,530ల చెక్కులను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, కోళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా జననాయక్ కర్పూరి ఠాగూర్ వర్ధంతి

భీమవరం టౌన్: భారతరత్న, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జననాయక్ కర్పూరి ఠాగూర్ వర్ధంతి సోమవారం భీమవరంలో నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొవడర్తి శివప్రసాద్ నివాళి అర్పించి మాట్లాడుతూ ఠాగూర్ డిసెంబర్ 1970 నుంచి జూన్ 1971 వరకు, మళ్లీ జూన్ 1977 నుంచి ఏప్రిల్ 1979 వరకు రెండు పర్యాయాలు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. అతను సామాజిక న్యాయం కోసం, వెనుకబడిన తరగతుల హక్కుల కోసం బలమైన న్యాయవాదిగా పోరాడారన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు అతను 26 నెలల జైలు జీవితం గడిపారన్నారు.

'సత్యనారాయణ మృతి వైసిపికి తీరనిలోటు'

ఆచంట: కొడమంచిలి మాజీ సొసైటీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నేత కాండ్రేగుల సత్యనారాయణ(64) అకాల మృతి వైసిపికి తీరని లోటని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం కొడమంచిలిలోని ఆయన స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయం చేస్తూ నిబద్ధత గల రాజకీయ నాయకుడిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, మాజీ జెడ్పిటిసి ముప్పాల వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు యల్లమెల్లి బేబీ రాణి, సభ్యులు కొండా కోటి సంతాపం తెలిపారు.

అఖండ అన్న సమారాధన

ఉండి : మండలంలోని పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ అమ్మవారి 60వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయం వద్ద సోమవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్థానిక మాజీ ఎంఎల్ఎ, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు విచ్చేశారు. 60వ వార్షికోత్సవం సందర్భంగా గతవారం రోజుల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కోలాటం, బాణసంచా కాల్పులు కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ కమిటీ తెలిపారు.

నేరాలు – ఘోరాలు

పాము కాటుకు గురై వ్యక్తి మృతి

యలమంచిలి : మండలంలోని యలమంచిలి గ్రామానికి చెందిన శనగల్ల ఆంజనేయులు(68) సోమవారం పాముకాటుకు గురై మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆంజనేయులు కుమారుడు అదే గ్రామంలో లంక పొలంలో వేరే వ్యక్తుల వద్ద లీజుకి తీసుకున్న కొబ్బరి చెట్లకు సంబంధించి దింపు తీస్తుండగా కొబ్బరికాయలు పోగుచేసి చేర వేయడానికి వెళ్లిన ఆంజనేయులు పక్కనే ఉన్న పంట బోదెలో పడిన కొబ్బరికాయలను తీయడానికి కిందకి దిగిన సమయంలో పాము కాటుకు గురయ్యాడు. ఈ విషయాన్ని అక్కడ ఉన్న వారికి చెప్పగా ఆంజనేయులును హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారని, ఆయనకు ప్రథమ చికిత్స చేస్తుండగా కొంతసేపటి తర్వాత మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

కాలువలో దూకి మహిళ గల్లంతు

తణుకు : తణుకు పట్టణానికి చెందిన మహిళ గోస్తనీ కాలువలో దూకి గల్లంతైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక సజ్జాపురం ప్రాంతానికి చెందిన గుమ్మళ్ల శాంతి(48) సోమవారం తెల్లవారుజామున సమీపంలోని జాతీయ రహదారి వంతెనపై నుంచి కాలువలో దూకినట్లు పోలీసులు భావిస్తున్నారు. వంతెనపై శాంతి షూస్ వదిలి ఉన్నట్లు గుర్తించారు. అయితే శాంతి ఆచూకీ కోసం పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీచ్‌లో అదృశ్యమైన వ్యక్తి కోసం గాలింపు

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం బీచ్‌లో అదృశ్యమైన వ్యక్తి కోసం చేపట్టిన గాలింపు చర్యలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం బంగారుపేటకు చెందిన తాపీమేస్త్రి వై.సతీశ్ ఈనెల 16న తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో చిత్రీకరించాడు. ఆ వీడియోలో తాను ఆన్‌లైన్ బెట్టింగ్‌ల్లో తీవ్రంగా నష్టపోయానని, తాను ఇక బతకలేనని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తమ్ముడికి సూచించాడు. అనంతరం పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. అప్రమత్తమమైన ఆయన కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించి వారు కూడా బీచ్‌కు చేరుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి తీరంలో గాలిస్తున్న ఆయన ఆచూకీ తెలియలేదు. ఆయన వినియోగించిన ద్విచక్ర వాహనం, చర్వానీలను బీచ్‌లో ఉండటానికి గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు.

ఇంట్లో చోరీ

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు సమీపంలో ఉన్న వెలగలేరు గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న శివాలయం ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో ఆదివారం రాత్రి భారీ దొంగతనం జరిగిందని స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.స్వామి సోమవారం సాయంత్రం ఇక్కడ తెలిపారు. ఎక్స్ మిలటరీకి చెందిన పడాల విజయ్ కుమార్ రెడ్డి గృహంలో వారు ఇంట్లో లేని సమయంలో ఈ దొంగతనం జరిగిందని, అయితే ఆయన భార్య ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్నందున ఎంత మేర నగదు, వస్తువులు పోయాయో తెలియాల్సి ఉందని అన్నారు. ప్రస్తుతం క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

గణపవరం: గణపవరం పంచాయతీ కార్యాలయం దగ్గరలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు గణపవరం ఎస్ఐ ఎ.మణికుమార్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఎనిమిది మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రాగానే మహిళ ఎఎస్ఐ వరలక్ష్మి తన సిబ్బందితో దాడిచేసి వారివద్ద నుంచి రూ.6,850ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


నివాసాల మధ్య డంపింగ్ యార్డ్ వద్దు

అడ్డుకున్న వార్డు కౌన్సిలర్ గంగరాజు : మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయింపు

మున్సిపల్ కమిషనర్ అంజయ్య హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో మున్సిపాలిటీ చెత్త వేశారు. మరో ట్రాక్టర్ వేస్తుండగా 19వ వార్డ్ కౌన్సిలర్ కేసరి గంగరాజు ఆ ప్రాంతానికి చేరుకుని మున్సిపల్ చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. వార్డు ప్రజలతో కలిసి కౌన్సిలర్ గంగరాజు మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నివాసాల మధ్య డంపింగ్ యార్డ్ వద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ మున్సిపల్ అతిథి గృహం, ఎంపిడిఒ ఆఫీసు, వార్డ్ సచివాలయం, మున్సిపల్ ఆఫీస్, మున్సిపల్ హై స్కూల్, మున్సిపల్ వాటర్ ట్యాంక్, ప్రయివేటు ఆసుపత్రి ఉన్న ఈ ప్రాంతాల్లో చెత్త వేయడం సరికాదన్నారు. మా వార్డు ప్రజల ఆరోగ్యాలు నాశనం అవుతాయని, వెంటనే చెత్తను తొలగించాలన్నారు. నివాసాల మధ్య చెత్త వేయడం సరికాదని, దీనిపై కమిషనర్ అంజయ్య సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పట్టణ సిఐ బి.యాదగిరి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సిఐ యాదగిరి, కమిషనర్ అంజయ్యతో చర్చించారు. చివరికి కమిషనర్ ఎం.అంజయ్య చెత్తను ఆ స్థలంలో వేయమని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. మున్సిపల్ కార్యాలయం వెనుక వేసిన చెత్తను తొలగించారు.



కౌన్సిలర్, వార్డు ప్రజలతో మాట్లాడుతున్న సిఐ, కమిషనర్

మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో రూట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రిన్సిపల్ త్రిపాఠికి బెస్ట్ టీచర్ అవార్డు

తణుకు : సుచిరిండియా ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే నిర్వహించబడిన సర్ సివి రామన్ స్టేట్ లెవల్ మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో తణుకు రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు సంస్థ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నాంపల్లి లలిత కళాతోరణం ఆడిటోరింలో ఈనెల 16వ తేదీ ఆదివారం జరిగిన సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డ్సు నైట్‌లో సుచిరిండియా ఎండి, సిఇఒ వై.కిరణ్, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రముఖ చలనచిత్ర నటుడు రావు రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రూట్స్ స్కూల్ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠిని గురుబ్రహ్మ(బెస్ట్ టీచర్) అవార్డుతో సత్కరించారు. దీనిలో భాగంగా రాష్ట్రస్థాయిలో 4వ తరగతికి చెందిన ఉత్కర్ష త్రిపాఠి మొదటి ర్యాంకు, జిల్లా స్థాయిలో 6వ తరగతికి చెందిన ఎల్.శ్రావణి, 9వ తరగతికి చెందిన బి.వేణుగోపాల్ మొదటి ర్యాంకులు, 8వ తరగతికి చెందిన పి.తపస్వి, 7వ తరగతికి చెందిన జి.శ్యామ్‌సుందర్ రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా గోల్డ్ మెడల్, మెమెంటో, సర్టిఫికెట్స్ రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, గురుబ్రహ్మ అవార్డు గ్రహీత అయిన సంస్థ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠికి పాఠశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు ఎన్.సుధాకరవర్మ, బి.విద్యాకాంత్, ప్రైమరీ ప్రిన్సిపల్ టి.సంధ్య, పురబి త్రిపాఠి, డి.పద్మజ, వి.శ్రీలత, ఎన్.మాణిక్యమాధురి, షేక్ సల్మా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.



న్యాయమూర్తి చిరంజీవిరావుని సత్కరిస్తున్న జడ్జిలు

న్యాయమూర్తి చిరంజీవిరావు సేవలు అభినందనీయం : జడ్జి సత్యవతి

తణుకు : న్యాయం కోసం కోర్టుని ఆశ్రయించి, కక్షిదారులకు తగిన న్యాయం అందించడంలో న్యాయమూర్తి పిఎస్‌పి చిరంజీవిరావు సేవలు అభినందనీయమని నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. 2018 నుంచి తణుకు స్పెషల్ మెజిస్ట్రేట్‌గా పనిచేసిన పిఎస్‌పి చిరంజీవిరావు ఉద్యోగవిరమణ పొందారు. గతంలో తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో అదనపు జిల్లా జడ్జిగా ఉద్యోగవిరమణ తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టుకి న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సోమవారంతో 70 ఏళ్ల వయస్సు పూర్తి కావడంతో స్పెషల్ మెజిస్ట్రేట్ హోదా నుంచి ఉద్యోగవిరమణ పొందారు. ఈ సందర్భంగా తణుకు పరిధిలో ఆయా కోర్టుల న్యాయమూర్తులు చిరంజీవిరావుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి.సాయిరాం, మొదటి అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పివిఎన్.రంజిత్‌కుమార్, బెంచ్ కోర్టు న్యాయమూర్తి టి.ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి'

మొగల్తూరు : ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని వైద్యులు రమేష్ అవగాహన కల్పించారు. మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ కె.రాజకిషోర్ అధ్యక్షతన సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఫోన్ల వినియోగం తగ్గించాలని, గుండె, రక్తపోటు, కీళ్ల నొప్పులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, సిబ్బంది ఉన్నారు.

సిహెచ్‌సిలో క్షయ నివారణపై అవగాహన

ఆకివీడు : రెండు వారాల నుంచి ఎడతెరిపిలేని దగ్గు, సాయంత్రం సమయాల్లో జ్వరం రావడం, ఆకలి మందగించడం, దగ్గినప్పుడు కళ్లెతో కలిపి రక్తం పడటం వంటి లక్షణాలు క్షయ వ్యాధి లక్షణాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గణేశ్వరరావు చెప్పారు. వీటికి తోడు బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక సామాజిక కేంద్రం అర్బన్ హెల్త్ సెంటర్లలో అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ గుడ్డ సంచులనే వాడాలి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పర్యావరణానికి హానిచేసే క్యారీ బ్యాగులు విడనాడి, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం భీమవరం ఆర్‌టిసి బస్టాండ్‌లో శ్రీవిజ్ఞానవేదిక, పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రయాణికులకు గుడ్డ సంచులను ఉచితంగా అందించారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ గుడ్డ సంచులను వినియోగించడం వల్ల భావితరాల భవిత భద్రంగా వుంటుందన్నారు. ప్రచార కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్యారీ బ్యాగులు వినియోగించడం వల్ల భూతాపం అధికమై భవిష్యత్తులో మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు కచ్చితంగా గుడ్డ సంచి వెంట తెచ్చుకోవాలన్నారు. అనంతరం 120 మంది ప్రయాణికులకు ఉచితంగా గుడ్డ సంచులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పంపిన గోపి, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్, రేషన్‌కార్డులు ఇప్పించండి

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సంచార జాతుల ధర్నా

నరసాపురం: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే మా లక్ష్యమని రాజకీయ పార్టీలు, నేతలు హామీలిస్తుంటారు. కానీ ఆచరణలో అవి కొంత మందికే దక్కుతున్నాయి. ఇంకా చాలామందికి ఆధార్, రేషన్ కార్డులు కూడా లేవు. ఇవి మాకు కల్పించాలంటూ పాలకొల్లు పట్టణంలోని యానాధుల కాలనీలో సంచార జాతులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వీరికి ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చింతపల్లి గురు ప్రసాద్ సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆర్‌డిఒ దాసిరాజును కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఆయన ఎన్నికల కోడ్ ముగియగానే అందరికి ఆధార్, రేషన్ కార్డులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. పాలకొల్లు తహశీల్దార్‌తో ఫోన్లో మాట్లాడి ఎంత మంది ఉన్నారో వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ సుమారు కాలనీలో 40 మంది వరకు ఆధార్ కార్డులు లేకుండా ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. వీరందరికీ టిడ్కో ఇళ్లు కేటాయించాలని, రేషన్, కులధృవీకరణ పత్రం, పిల్లలకు హాస్టల్లో సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నరేష్ జయరాజ్, మరియమ్మ, చల్లమ్మ, సంజీవ్ ఏడుకొండలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీ విజేత 'పశ్చిమ'

భీమవరం : ఈనెల 16, 17 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలోని డాన్ బాస్కో హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరగిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అండర్-19 బాల బాలికల నెట్ బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. బాలురు జట్టు తృతీయ స్థానాన్నికైవసం చేసుకుంది. ఈ క్రీడలకు సంబంధించిన వివరాలను జిల్లా నెట్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్.విజయలక్ష్మి తెలిపారు. నెట్ బాల్ బాలికల పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో వైఎస్ఆర్ కడప జిల్లా, తృతీయ స్థానంలో విశాఖ జిల్లా నిలిచింది. నెట్ బాల్ బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా, ద్వితీయ స్థానలో విశాఖ, తృతీయ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా నిలిచాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పుగోదావరి జిల్లా నెట్ బాల్ సంఘ అధ్యక్షులు కె.అశోక్ రెడ్డి, డాన్ బాస్కో హై స్కూల్ ప్రిన్సిపల్ ఫాదర్ ఐ.బల్మదర్, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెలలో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్ పి.దావూద్ ఖాన్ తెలిపారు. ఈ నెట్ బాల్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను పశ్చిమగోదావరి జిల్లానెట్ బాల్ సంఘ సభ్యులు పి.దావూద్ ఖాన్, వి.వినీత్, జి.విజయ్ కుమార్, సుధీర్, రామకృష్ణ, శ్రీనువాసు, వెంకటేష్ అభినందించారు.




విజేతలుగా నిలిచిన పశ్చిమ జట్టు


జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

మక్కువ ప్రజాశక్తి విలేకరిపై దాడికి వ్యతిరేకంగా నిరసనలు - కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్


పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ మన్యం పార్వతీపురం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుపై దాడి చేసి, చంపేస్తానని బెదిరించిన టిడిపి నాయకుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లాలో జర్నలిస్టులు, నేతలు కదంతొక్కారు. భీమవరంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు గుండా రామకృష్ణ, వేగిరాజు రాధాకృష్ణంరాజు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆకివీడులో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. యలమంచిలి, గణపవరం, కాళ్ల, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, ఉండి, పెనుగొండ, మొగల్తూరు, పాలకొల్లు, పెనుమంట్రల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందించారు.



పాలకొల్లులో..




పెనుమంట్రలో..




మొగల్తూరు..



కాళ్ల..



తాడేపల్లిగూడెం..




పెనుగొండ..



ఉండి..

ఐలూ ఆధ్వర్యాన నిరసన



తణుకులో వినతి అందిస్తున్న జర్నలిస్టులు, న్యాయవాదులు

ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుపై టిడిపి మండల అధ్యక్షులు వేణుగోపాల్‌నాయుడు దాడి చేయడం, బెదిరించడం హేయమైన చర్య అని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ఖండించారు. ప్రజాశక్తి విలేకరిపై దాడికి నిరసనగా ఐలు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీలల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి డిప్యూటీ తహశీల్దార్ ఎన్.శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ విలేకరిపై దాడి అప్రజాస్వామికమన్నారు. పైగా చంపుతానని బెదిరించిన వేణుగోపాలనాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విలేకరికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గొల్లపల్లి అంబేద్కర్, ప్రతాప్, ఎం.శాంసన్ తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి..

ఒలింపియాడ్‌లో మాంటిస్సోరిస్ విద్యార్థులకు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఇంటర్నేషనల్ సోషల్ ఒలింపియాడ్ సిల్వర్ జోన్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారిచే డిసెంబర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ సోషల్ ఒలింపియాడ్‌లో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులు 5 గోల్డ్ మెడల్స్ సాధించారు. పిల్లి గౌతం 4వ తరగతి, ముత్యాల గణ వెంకట దేవి అభిరామ్ 5వ తరగతి, జోగి వెంకట సాయి మృత వర్షిణి 7వ తరగతి, చింతపల్లి తన్విజ 9వ తరగతి, చిత్రాడ సౌమ్య సత్యసాయి రేణుక 10వ తరగతి విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా స్కూల్ అడ్మినిస్ట్రేటర్, డైరెక్టర్ మద్దాల వాసు మాట్లాడుతూ ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యార్థుల ప్రతిభ పోటీపరీక్షలలో వారి హవా కొనసాగిస్తున్నారని, న్యూ ఢిల్లీ సిల్వర్ జోన్ వారిచే నిర్వహించిన ఇంటర్నేషనల్ సోషల్ ఒలింపియాడ్‌లో 5 గోల్డ్ మెడల్స్ ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులు సాధించారన్నారు. అకడమిక్ పరీక్షలతో పాటు ఇటువంటి కాంపిటేటివ్ పరీక్షలు రాయించడం ద్వారా ఇంటర్ తరవాత జరిగే మెడికల్, ఇంజనీరింగ్ వంటి ఎంట్రన్స్ పరీక్షల పోటీని ఎదురుకుని విజేతలుగా నిలుస్తున్నారని, అందుకే ఈ కాంపిటేటివ్ పరీక్షలు ప్రైమరీ స్కూలు నుంచి విద్యార్థులు రాస్తున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా సోషల్ ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, ప్రిన్సిపల్ సామవేదం వసంతలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కూటమి ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించండి'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకి మద్దతుగా కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. భీమవరం పట్టణం సూర్యనారాయణపురంలోని 34, 36వ వార్డులలో టిడిపి కూటమి నాయకులు భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సోమవారం స్థానిక భాష్యం స్కూల్, జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ప్రచారం నిర్వహించి, ఉపాధ్యాయులకు కరపత్రాలను పంపిణీ చేశారు. పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరారు. వర్తనపల్లి కాశీ, పుల్లా బాబి పాల్గొన్నారు.

మొగల్తూరు : ఎంఎల్‌సి ఎన్నికల బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని విప్ బొమ్మిడి నాయకర్, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కోరారు. మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. నాయకులు వి.సూర్యనారాయణ రాజు, గుర్తులు సాయి, గుబ్బల నాగరాజు ఉన్నారు.

'ముస్లిం మైనార్టీల పక్షపాతి టిడిపి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ముస్లిం మైనార్టీల పక్షపాతి ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం అని ఆచంట నియోజకవర్గ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సయ్యద్ అలీ జిన్నా అన్నారు. సోమవారం సాయంత్రం మార్టేరులో ఆయన మాట్లాడుతూ మార్చి 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రంజాన్ నెల ముస్లిం సోదరులు ఉపవాస ప్రార్థనలు ఉంటాయని, ముస్లిం సోదరులు ఉద్యోగ విధుల నుంచి గంట ముందు వెళ్లేందుకు సడలింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. ముస్లిం సోదరులు ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల నియోజకవర్గం కూటమి ఉమ్మడి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి ముస్లిం మైనార్టీలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.